ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపు

ర్యాండమైజేషన్‌లో పాల్గొన్న అధికారులు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 3 : ఎన్నికల కౌంటింగ్ అబ్జర్వర్లు రాబర్ట్‌సింగ్ క్షేత్రిమయుమ్, ఎండీ ఎజ్జుబా హుస్సేన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కె.జండగే సమక్షంలో ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది కేటాయింపును కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం చేపట్టారు. నేడు జరిగే భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కార్యక్రమం సందర్భంగా 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ సిబ్బందిని రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పండ్ల పంపిణీ

ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆలేరు రూరల్, జూన్ 3 : రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం ఆలేరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పేదల పక్షాన పోరాడేది బీఆర్ఎస్ మాత్రమే అని అన్నారు. కేవలం 6 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అష్టకష్టాలను మిగిల్చిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు అండగా నిలిచి వివిధ సమస్యలపై ప్రభుత్వం మేడలు వంచి పోరాటాలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పత్తి వెంకటేశ్, దయ్యాల సంపత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రాచకాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

రాచకాల్వను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరి కలెక్టరేట్, జూన్ 3 : వడపర్తి కత్వ నుంచి భువనగిరి పెద్ద చెరువులోకి నీళ్లు వెళ్లే రాచకాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భువనగిరి మండలం హన్మాపురంలోని రాచకాల్వ పనులను సీపీఎం నాయకత్వం, రైతులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ వానకాలం వచ్చినా కాల్వ పనులను ఎందుకు పూర్తిచేయడం లేదని ప్రభుత్వాన్ని, కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. కాల్వ కింద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాల్వ పనులు పూర్తిచేసేందుకు యుద్ధ ప్రాతిపదికన నిధులు విడుదల చేయాలన్నారు. కాల్వపైన 14 చోట్ల బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని, కాల్వ మధ్యలో ఉన్న మట్టి కుప్పలను తొలగించాలన్నారు. వారంలో పనులు చేపట్టకపోతే రైతులను సమీకరించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, నాయకులు మోటె ఎల్లయ్య, బండి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

● సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు మధు

పెద్దరావులపల్లి రహదారిలో గుంతలమయమైన రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 3 : మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు గుంతలమయమై చెరువులను తలపిస్తున్నాయని సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యుడు మంచాల మధు అన్నారు. సోమవారం మండలంలోని రేవణపల్లి, గౌస్‌కొండ, పెద్దరావులపల్లి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవణపల్లి నుంచి పెద్దరావులపల్లికి వెళ్లే రోడ్డు పెద్ద పెద్ద గుంతలుగా మారి వర్షపు నీరు నిలువడంతో ప్రయాణికులు ప్రమాదానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మరమ్మతులు చేపట్టకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కుతాటి అశోక్, తుపల్లి బాల్‌రెడ్డి, దుబ్బాక దుర్గాప్రసాద్, మంకలి శివ, లింగస్వామి పాల్గొన్నారు.

రామన్నపేట-దుబ్బాక రోడ్డుపై రాస్తారోకో ..

రామన్నపేట, జూన్ 3 : గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రామన్నపేట-దుబ్బాక రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గాదె నరేందర్, మండల కమిటీ సభ్యుడు కందుల హన్మంతు మాట్లాడుతూ.. గత మూడు నెలల నుంచి రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, 15రోజుల క్రితం ఆర్‌అండ్‌బీ డీఈకి వినతిపత్రం అందజేసినా స్పందన లేదన్నారు. దీంతో రాస్తారోకో చేసి నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ మల్లయ్య సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో నాయకులు గొరిగె సోములు, పిట్టల శ్రీను, బావండ్లపల్లి బాలరాజు, మునుకుంట్ల లెనిన్, బావండ్లపల్లి సత్యం, ఆముద ఆంజనేయులు, బోల్ల వెంకన్న, గంజి అశోక్, వెంకట్‌రెడ్డి, మల్లేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

సాగు పనిలో రైతన్న

ముమ్మరంగా పత్తి సాగు

మోత్కూరు మండలం పాటిమట్లలో పత్తి గింజలు విత్తేందుకు అచ్చు తీస్తున్న రైతు

పాటిమట్లలో పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళలు

మోత్కూరు, జూన్ 3 : వర్షాలు పలుకరించడంతో అన్నదాతలు వానకాలం సాగుకు సిద్ధమయ్యారు. జిల్లాలో ఇప్పటికే పలుసార్లు కురిసిన వర్షాలకు దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి కొంతమంది రైతులు పత్తి విత్తనాలు విత్తే పనిలో నిమగ్నమయ్యారు. మెట్ట పంటల సాగుకు రోహిణి, మృగశిర బలమైన కార్తెలని నమ్మే రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు దుక్కులు సిద్ధం చేయగా, ఆదివారం రాత్రి కురిసిన వానకు సోమవారం మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), గుండాల మండలాల్లో పలువురు రైతులు పత్తి విత్తనాలు విత్తుతూ కనిపించారు. ఈ ప్రాంతాల్లో నల్లరేగడి భూములు అధికంగా ఉండటంతో పత్తి పంటకు అనుకూలమని భావిస్తున్న రైతులు ముందస్తుగానే విత్తనాలు విత్తుతున్నారు.

రోహిణి కార్తె పత్తికి అనుకూలమని..

రోహిణి, మృగశిరలు అధిక దిగుబడులకు అనుకూలం. రోహిణి కార్తెలో పత్తి విత్తితే కార్తె బలంతో చేను ఏపుగా పెరుగుతుంది. 15 రోజుల కింద పడిన వానలకు దుక్కులు సిద్ధం చేశాం. ఆదివారం రాత్రి కురిసిన వానకు పత్తి గింజలు విత్తుతున్నాం.

-దొండ రాములు, రైతు, పాటిమట్ల, మోత్కూరు

ఆలేరు విద్యార్థికి పాలిసెట్‌లో 19వ ర్యాంక్

శివాజీ

భారత అఖిల

రవ్వ మనోహర్

ఆలేరు రూరల్, జూన్ 3 : ఆలేరుకు చెందిన వల్లాల శివాజీకి సోమవారం విడుదలైన పాలిసెట్-2024 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 19వ ర్యాంక్ లభించింది. ప్రతిభ కనబర్చి రాష్ట్ర ర్యాంక్‌ను కైవసం చేసుకున్న శివాజీని స్థానిక ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అభినందించారు.

గౌతమి విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 3 : పట్టణ కేంద్రంలోని గౌతమి హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు పాలిసెట్‌లో ర్యాంకులు సాధించారు. రవ్వ మనోహర్ (216 ర్యాంక్), భారత అఖిల (1841)ర్యాంకులు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రావుల జంగయ్య సోమవారం విలేకరులకు తెలిపారు. వారిని ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు ఆటపాటల్లో రాణించాలి

● మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

విద్యార్థినికి ప్రతిభాపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, జూన్ 3 : విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని చందన స్కూల్‌లో సమ్మర్ క్యాంపు ముగింపులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు ప్రతిభా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి శిక్షణలతో పిల్లల మేధస్సు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తాడూరి శిరీషాపరమేశ్, పాఠశాల యాజమాన్యం అవ్వారు రామేశ్వరి, అవ్వారు గోవర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సులను వినియోగించుకోవాలి

చౌటుప్పల్ : ఉచిత బ్యూటీషియన్ కోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. సోమవారం పట్టణ కేంద్రంలోని షాదీఖానాలో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత బ్యూటీషియన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల మహిళలు ఆర్థికంగా ఎదుగేందుకు ఈ కోర్సులు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మూర్తి, మంగ, మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

● జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమంతు జెండగేకు ఫిర్యాదు

జిల్లా రిటర్నింగ్ అధికారి హనుమంతు కె.జెండగేకు ఫిర్యాదు చేస్తున్న యుగంధర్‌రెడ్డి, వెంకటేశం

వలిగొండ, జూన్ 3 : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని సామాజిక సేవా కార్యకర్త తుమ్మల యుగంధర్‌రెడ్డి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగేను కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తుమ్మల యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ ఉద్యమకారుల పేరుతో రూపొందించిన సీడీని ఆవిష్కరించి కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న)కు ఉద్యమకారలతో కలిసి మద్దతు ప్రకటించిన ఎస్ఐ మహేందర్‌లాల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామని, ఎస్ఐపై తగిన చర్యలు తీసుకోకపోతే కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు వెంకటేశం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మకూరు(ఎం), జూన్ 3 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2011–2012 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తోటి స్నేహితులను ఆప్యాయంగా పలుకరించుకొని సంతోషం వ్యక్తం చేశారు.

అనంతరం పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో వాణి, మౌనిక, సునీత, నాగరాజు, హైమద్, సతీశ్, క్రాంతి, భరత్ పాల్గొన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సౌమ్య అంత్యక్రియలు పూర్తి

యాదగిరిగుట్ట, జూన్ 3 : అమెరికాలోని ఫ్లోరిడా నగరంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుడ్ల సౌమ్య మృతదేహం సోమవారం తన స్వగృహానికి చేరింది. గత ఆదివారం రాత్రి ఫ్లోరిడాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. కాగా, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఆమెరికాకు చెందిన తానా సొసైటీతోపాటు భారత రాయబార కార్యాలయం ప్రత్యేక చొరవతో మృతదేహాన్ని ఇక్కడికి తీసుకొచ్చారు. తెల్లవారుజామున 4:30 గంటలకు యాదగిరిపల్లికి చేరిన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, బంధువుల సందర్శనార్థం కొద్దిసేపు ఉంచి అనంతరం అంత్యక్రియలు పూర్తి చేశారు. మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రావి నారాయణరెడ్డి విగ్రహ ఏర్పాటుకు నేడు భూమిపూజ

భువనగిరి కలెక్టరేట్, జూన్ 3 : మాజీ ఎంపీ, పద్మ విభూషణ్ రావి నారాయణరెడ్డి కాంస్య విగ్రహ ఏర్పాటుకు మంగళవారం మండలంలోని బొల్లేపల్లిలో భూమిపూజ నిర్వహిస్తున్నట్లు రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రావి నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకుని విగ్రహ ఏర్పాటు కోసం నిర్వహించే భూమి పూజలో రావి నారాయణరెడ్డి అభిమానులు, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పాల్గొని కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పిడుగుపాటుతో ఆవులు మృతి

తుర్కపల్లి, జూన్ 3 : పిడుగుపాటుకు గురై రెండు ఆవులు మృతి చెందిన సంఘటన మండలంలోని మోతీరాంతండా గ్రామపంచాయతీ పరిధిలోని గోగులగుట్టతండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. తండాకు చెందిన రైతు ధరావత్ చందూనాయక్ తన ఆవులను వ్యవసాయ బావి వద్ద చెట్టు కింద కట్టేశాడు. ఆదివారం సాయంత్రం పాలు పిండుకొని ఇంటికి వెళ్లాక రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో ఆవులపై పిడుగు పడడంతో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

ఆర్థిక సాయం

రామన్నపేట, జూన్ 3 : మండలంలోని నీర్నేముల గ్రామానికి చెందిన సుర్వి యాదమ్మ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందింది. సోమవారం స్థానిక నాయకులు సందర్శించి ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి కందిమళ్ల గోపాల్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నోముల ప్రవీణ్, సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 3 : మండలంలోని దోతిగూడెంలో మల్లికార్జున స్వామి దేవాలయంలో సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ వేషధారణలో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం ఆదిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పగిళ్ల రాంరెడ్డి, బాలం మల్లేశ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, సత్యంయాదవ్, లింగారెడ్డి, బుచ్చిరెడ్డి, అమరేందర్‌రెడ్డి, మల్లయ్య, విష్ణు, శ్రీశైలం, మహేందర్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, మల్లయ్య, వెంకటేశం, సత్తయ్య, బాల్‌రెడ్డి, పరమేశ్ పాల్గొన్నారు.

భర్తపై దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 3 : అకారణంగా తన భర్తపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వారిపై చర్యలు చేపట్టాలని రూరల్ పోలీసులకు బాధితుడి భ్యార్య సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మన్నెవారిపంపు గ్రామానికి చెందిన మేడబోయిన రాము కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం జరిగిన బొడ్రాయి పండుగలో భాగంగా బోనాలు తీస్తుండగా అదే గ్రామానికి చెందిన బోయిని నర్సింహ గొడవకు దిగాడు. ఈ క్రమంలో బోయిని నర్సింహ కుమారులు రాంబాబు, మురళి, నర్సింహ సోదరుడు బోయిని పాండు.. రాముపై దాడికి పాల్పడ్డారు. విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన బాధితుడు రామును చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, తన భర్తపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని బాధితుడి భార్య శ్రావణి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

గుట్టలో లక్ష్మీనరసింహుడి నిత్య తిరుకల్యాణం

సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 3 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సోమవారం ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణం జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వర స్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.28,80,593 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. అలాగే స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల్లో 1,000 మందికి దేవస్థానం ఆధ్వర్యంలో నిత్యాన్నదానం చేయనున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. గతంలో 600 మందికి మాత్రమే అన్నదానం చేయగా, సోమవారం నుంచి మరో 400 మందికి పెంచుతూ దేవస్థానం నిర్ణయం తీసుకుంది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు రూ.150 ప్రత్యేక దర్శనానికి కావాల్సిన క్యూలైన్లను ఆలయ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. తూర్పు రాజగోపురం వద్ద పైకప్పుతో కూడిన క్యూలైన్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇందుకోసం స్టీల్ గ్రిల్‌ను ఏర్పాటు చేస్తుండగా ఈఓ భాస్కర్ రావు పరిశీలించారు.

ఉద్యమ నేత వంగపల్లికి సన్మానం

ఉద్యమ నేత, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లిని సన్మానిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

యాదగిరిగుట్ట, జూన్ 3 : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, ఓయూ జేఏసీ నేత, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌కు ఘన సన్మానం లభించింది. సోమవారం సిద్దిపేట జిల్లా కార్యాలయంలో వంగపల్లిని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ఉద్యమంలో ముందుండి పోరాడిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు వంగపల్లి శ్రీనివాస్ అని కొనియాడారు. రాష్ట్రం ఏర్పడి పదేండ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ ఉద్యమకారులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రితోపాటు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ వంగపల్లికి అభినందనలు తెలిపారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్‌వై నాయకులు

మాజీ మంత్రి హరీశ్‌రావుకు లక్ష్మీనరసింహ స్వామి ప్రసాదాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ధనుంజయ్‌గౌడ్

భువనగిరి కలెక్టరేట్, జూన్ 3 : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జన్మదినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్‌వై జిల్లా నాయకుడు మట్ట ధనుంజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేటలోని ఆయన నివాసంలో హరీశ్‌రావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్‌వై నాయకులు సుంకరి రవి, జిత్తు అన్నారం రాజు ఉన్నారు.

వెంకటేశ్వరుడి కల్యాణానికి రండి

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు ఆహ్వానం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు వెంకటేశ్వరుడి కల్యాణ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నేస్తం ఫ్రెండ్స్ సభ్యులు

రాజాపేట, జూన్ 3 : మండల కేంద్రంలోని వెంకటేశ్వరాలయంలో నేస్తం ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 9న వెంకటేశ్వర కల్యాణం నిర్వహించనున్నారు. సోమవారం యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను నేస్తం ఫ్రెండ్స్ సభ్యులు కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నెమిలె మహేందర్‌గౌడ్, నేస్తం ఫ్రెండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

ఆలేరులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్‌రావు

ఆలేరు రూరల్, జూన్ 3 : మండల కేంద్రంలోని గ్రోమోర్, లక్ష్మీనరసింహ, విశ్వనాథం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కొలనుపాకలోని రాజరాజేశ్వర, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం విత్తనాలు, ఎరువుల దుకాణాలను సోమవారం ఏడీఏ వెంకటేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ వేణు, దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వద్దు

● తాసీల్దార్‌కు వినతి

గుండాల, జూన్ 3 : మండలంలోని వస్తాకొండూర్ గ్రామంలోని బిక్కేరు వాగు నుంచి ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతులు ఇవ్వద్దని సోమవారం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మూగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తాసీల్దార్ జలకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వస్తాకొండూర్ బిక్కేరు వాగు నుంచి గతంలో కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు బస్వాపురం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఇసుక రవాణా చేసేందుకు అనుమతులు తీసుకున్నారని, వాటిని అడ్డుపెట్టుకుని ఇప్పుడు ఇసుక రవాణా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వాటిని అరికట్టాలని తాసీల్దార్‌ను కోరారు.